వీధి దీపాల నిర్వహణ బాధ్యత సర్పంచులకే..

- అన్ని ఎల్ఇడి లైట్లను సిసిసికి అనుసంధానించండి...
- వాటి ఏర్పాటుకు కొత్తగా టెండర్లు పిలవండి
- ఉన్నతస్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎల్ఇడి వీధి దీపాలపై రాష్ట్రమంతటా పక్కాగా పర్యవేక్షణ ఉండాలని ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అన్ని గ్రామాల్లో వీధి దీపాల ఏర్పాటు, వాటి నిర్వహణ బాధ్యతలను సర్పంచులకే అప్పగించాలని సూచించారు. గ్రామాల్లో అవసరమైనన్ని కొత్త ఎల్ఇడి లైట్లను అమర్చటంతో పాటు వాటిని సమర్థంగా నిర్వహించే నిర్వహణ అధికారం గ్రామ పంచాయతీల పరిధిలోనే ఉండాలని ఆయన స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (సిసిసి)లో మున్సిపల్, పంచాయతీ రాజ్, జిహెచ్ఎంసి అధికారులతో సిఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో ఇప్పటికే అందుబాటులో ఉన్న ఎల్ఇడి లైట్లు వెలుగుతున్నాయా? లేదా? లేకపోతే కొత్తగా ఎన్ని అవసరమున్నాయో పక్కాగా అంచనా వేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ప్రతీ పోల్‌నూ సర్వే చేయాలని పంచాయతీ రాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. రాత్రి పూట ఎల్ఈడీ లైట్లు పని చేయటంతోపాటు పగటిపూట దుర్వినియోగం కాకుండా ఉండేందుకు పక్కగా పర్యవేక్షణ చేయాలనీ, అన్ని గ్రామాల ఎల్ఇడి డ్యాష్ బోర్డులను మండల స్థాయిలో ఎంపీడీవో పర్యవేక్షించాలని దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో అడిషనల్ కలెక్టర్‌కు ఈ బాధ్యతలు అప్పగించాలన్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాల పరిధిలో 16.16 లక్షల ఎల్ఈడీ లైట్లున్నాయని, వరంగల్, నల్గొండ, జనగాం, నారాయణపేట జిల్లాల్లో ఎల్ఈడీ లైట్ల కాంట్రాక్టు ఏజెన్సీ అధ్వర్యంలో ఉందని అధికారులు ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. అన్ని గ్రామాల్లో సర్పంచులకే వీటిని అప్పగిస్తే.. లైట్ల నిర్వహణ, విద్యుత్తు దుర్వినియోగం కాకుండా అడ్డుకట్ట పడుతుందనే అభిప్రాయాలు సమావేశంలో వ్యక్తమయ్యాయి.


సమీక్షలో మాట్లాడుతున్న సిఎం రేవంత్ రెడ్డి

కాగా జిహెచ్ఎంసి పరిధిలో 5.50 లక్షల ఎల్ఈడీ లైట్లు ఉన్నాయని, అవుటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ సిటీని కూడా కలిపితే మొత్తం 7.50 లక్షల లైట్లు అవసరమవుతాయని మున్సిపల్ శాఖ సీఎంకు నివేదించింది. గతంలో ఉన్న ఏజెన్సీ కాంట్రాక్టు ముగియటంతో ఇప్పుడు చాలాచోట్ల లైట్లు వెలగటం లేదని, నిర్వహణ కూడా సరిగా జరగలేదని అధికారులు తెలిపారు. కోర్ అర్బన్ సిటీ పరిధిలో జీహెచ్ఎంసీతో పాటు కొత్తగా చేరిన కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని ఎల్ఈడీ లైట్ల అవసరాన్ని అంచనా వేయాలని సిఎం... వారిని ఆదేశించారు. ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు, నిర్వహణకు కొత్తగా టెండర్లు పిలవాలని కోరారు. వాటి తయారీలో పేరొందిన కంపెనీలను ఆహ్వానించాలనీ, ఏడేండ్ల పాటు నిర్వహణ బాధ్యతలు వాటికే అప్పగించాలని సూచించారు. నిర్వహణ పక్కగా ఉండేందుకు వీలుగా టెండర్ నిబంధనలను రూపొందించుకోవాలని ఆదేశించారు.

ఎల్ఈడీ లైట్లతో పాటు కంట్రోల్ బాక్స్ ల ఏర్పాటు, నిరంతరం అవి పనిచేస్తున్నాయా? లేదా? ఏయే ప్రాంతాల్లో ఇబ్బందులున్నాయో తెలుసుకునేందుకు ప్రత్యేకంగా వ్యవస్థ ఉండాలని అన్నారు. ఇందుకు సంబంధించి హైదరాబాద్ ఐఐటీ లాంటి సంస్థలతో థర్డ్ పార్టీ ఆడిట్ చేయించాలని సూచించారు. ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలో వీధి దీపాలకు ప్రతి నెలా రూ.8 కోట్ల కరెంటు బిల్లు చెల్లించాల్సి వస్తోందని, విద్యుత్తును ఆదా చేసేందుకు వీలుగా సోలార్ పవర్‌ను వినియోగించే అంశాన్ని, అందుకు అవసరమైన సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సిఎం ఆదేశించారు. కోర్ అర్బన్ సిటీ ఏరియాతో పాటు ఔటర్ అవతల ఉన్న మున్సిపాలిటీల్లోనూ ఎల్ఈడీ లైట్ల ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ మున్సిపాలిటీలతో పాటు కొన్ని మున్సిపాలిటీల్లో కొత్త గ్రామాల విలీనం, గ్రామాల మార్పులు చేర్పులు జరిగాయని అన్నారు. వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని ఎల్ఈడీ లైట్ల అవసరాన్ని అంచనా వేయాలని సూచించారు. కోర్ అర్బన్ సిటీతో పాటు మున్సిపాలిటీల్లో ఎల్ఈడీ లైట్లకు కూడా టెండర్లు పిలవాలని ఆయన ఆదేశించారు. సమీక్షా సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, పంచాయితీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్, కోర్ అర్బన్ ఏరియా మున్సిపల్ సెక్రటరీ ఇలంబర్తి, మున్సిపల్ శాఖ కార్యదర్శి శ్రీదేవి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ శ్రీజన పాల్గొన్నారు.

జ్వాలాముఖి సతీమణి సీతాదేవి కన్నుమూత



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రముఖ విప్లవ కవి, దిగంబర కవుల్లో ఒకరైన జ్వాలాముఖి జీవిత సహచరిణి సీతాదేవి (85) అనారోగ్య సమస్యలతో సోమవారం హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో స్వగృహంలో కన్నుమూశారు. సీతాదేవి కొంతకాలంగా విపరీతమైన మోకాళ్ల నొప్పులు, జ్వరంతో బాధపడుతున్నారు. దానికి తోడు వృద్ధాప్య సమస్యలు తోడయ్యాయి. అనారోగ్య సమస్యలు తీవ్రం అవ్వడంతో ఆదివారం ఒక ప్రయివేటు ఆస్పత్రిలో జాయిన్ అయ్యారు. స్వయంగా ఆమె తమ్ముడు డాక్టర్ చారి పర్యవేక్షణలో చికిత్స కూడా అందించారు. సోమవారం తెల్లవారుజామున పరిస్థితి విషమించి ఆమె కన్నుమూశారు. ఆమె అంత్యక్రియలు అంబర్‌పేట శ్మశాన వాటికలో సోమవారం సాయంత్రం ముగిశాయి. జ్వాలాముఖి 2008లో మరణించిన సంగతి తెలిసిందే. ఆ దంపతులకు ముగ్గురు కుమారులు సంపత్, శ్రీధర్, వాసు కాగా కొన్నేళ్ల కిందట శ్రీధర్ మరణించారు. సనాతన శ్రీవైష్ణవ కుటుంబంలో పుట్టినప్పటికీ సీతాదేవి కుటుంబాన్ని విప్లవ ఆదర్శాలకు అనుగుణంగా నడిపారు. ఆమె మృతి సాహిత్యలోకానికి తీరని లోటు అని తెలంగాణ సాహితీ స్రవంతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనందాచారి, అధ్యక్షులు వల్లభాపురం జనార్ధన పేర్కొంటూ సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అంగన్‌వాడీలపై లాఠీఛార్జీ అరెస్టులకు సిపిఎం ఖండన

- ఎన్ఇపిని రాష్ట్రంలో అమలు చేయొద్దు : జాన్‌వెస్లీ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నూతన విద్యావిధానం (ఎన్ఈపీ-2020)ని రాష్ట్రంలో అమలు చేయొద్దనీ, అంగన్‌వాడీల వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్త నిరసనలు చేపట్టిన అంగన్‌వాడీ టీచర్లపై లాఠీఛార్జీ చేసి, అరెస్టులు చేయడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. కొడంగల్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటి వద్ద నిరసన తెలిపేందుకు వెళ్తున్న అంగన్‌వాడీ టీచర్లు, సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు జయలక్ష్మిపై పోలీసులు లాఠీచార్జీ చేయడం సరైంది కాదని తెలిపింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెచ్చిన నూతన విద్యా విధానం (ఎన్ఈపీ-2020) వల్ల ఐసిడిఎస్‌తోపాటు, విద్యా వ్యవస్థకు ప్రమాదకరమైన విధానాన్ని తెలంగాణ ప్రభుత్వం అమలు చేయడానికి పూనుకుంటున్నదని విమర్శించారు. దీని వల్ల పేద ప్రజలతోపాటు, అంగన్‌వాడీ వర్కర్లు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధానాలను రాష్ట్రంలో అమలు చేయొద్దనీ, వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్రం తెచ్చిన నూతన విద్యా విధానాన్ని రాష్ట్రంలో అమలు చేయొద్దని కోరారు. అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



ఇనార్బిట్ 'వ్రాంగ్'లో ఇబ్రహీం అలీ ఖాన్ సందడి

హైదరాబాద్ : ఇనార్బిట్‌మాల్‌లోని షాపర్స్ స్టాప్‌లో ఏర్పాటు చేసిన వ్రాంగ్ కొత్త ఉత్పత్తులను బాలీవుడ్ నటుడు ఇబ్రహీం అలీ ఆవిష్కరించారు. షాపర్స్ షాప్‌తో వ్రాంగ్ భాగస్వామ్యం ద్వారా ఇక్కడ ఆ సంస్థ కొత్త ఉత్పత్తులను సోమవారం ఇబ్రహీం అలీ విడుదల చేశారు. ఈ సందర్భంగా స్టోర్‌లో ఇబ్రహీం సందడి చేశారు. ఈ కార్యక్రమంలో షాపర్స్ స్టాప్ ఎండి కవీంద్ర మిశ్రా, వ్రాంగ్ కో ఫౌండర్స్ అంజనా రెడ్డి, విక్రమ్ రెడ్డి పాల్గొన్నారు,

హైదరాబాద్‌లో 1 ఫైనాన్స్ సెంటర్ ఏర్పాటు

హైదరాబాద్ : హైపర్ పర్సనలైజ్డ్ ఫైనాన్షియల్ ప్లానింగ్ సర్వీసులను అందించే 1ఫైనాన్స్ హైదరాబాద్‌లో తమ ఫైనాన్సియల్ ప్లానింగ్ సెంటర్‌ను ప్రారంభించినట్లు వెల్లడించింది. థానే తర్వాత ఇది కంపెనీకి రెండవ కేంద్రమని పేర్కొ "నిపుణులు, వ్యవస్థాపకులు, వ్యాపార కుటుంబాలకు హైదరాబాద్ నిలయం. వీరిలో చాలా మంది ఆర్థికంగా మహోన్నత ఆకాంక్షలు కలవారే కానీ నిజంగా సంఘర్షణ లేని సలహాలు పొందలేక పోతున్నారు. మెరుగైన సలహాలు అందించటంతో పాటుగా, జీవితకాల సంబంధాలను నిర్మించడం 1 ఫైనాన్స్ లక్ష్యం." అని ఆ సంస్థ ప్రెసిడెంట్ అనూజ్ మెహతా అన్నారు.

ఐసెట్ తుదివిడత కౌన్సెలింగ్‌లో నేడు ధ్రువపత్రాల పరిశీలన

హైదరాబాద్ బ్యూరో : రాష్ట్రంలో ఎంబిఎ, ఎంసిఎ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఐసెట్ తుదివిడత కౌన్సెలింగ్ ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఐసెట్ ప్రవేశాల కన్వీనర్ ఎ శ్రీదేవసేన ఒక ప్రకటన విడుదల చేశారు. మంగళవారం ఐసెట్ అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని తెలిపారు. మంగళ, బుధవారాల్లో వెబ్‌ఆప్షన్లను నమోదు చేసేందుకు అవకాశముంటుందని పేర్కొన్నారు. ఈనెల 20న ఐసెట్ తుదివిడత సీట్లు కేటాయిస్తామని వివరించారు. ఈనెల 20 నుంచి 22 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించాలనీ, వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. 22, 23 తేదీల్లో కేటాయించిన కాలేజీల్లో రిపోర్టు చేయాలని కోరారు. ఇతర వివరాల కోసం https:// tgicet. nic. in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

ముమ్మరంగా వరద సహాయక చర్యలు

- మంత్రి పొంగులేటి ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న ప్రాంతాల్లో చేపట్టిన సహాయక చర్యలను మరింత ముమ్మరం చేయాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు బుధవారం నాడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలోని తన కార్యాలయంలో భారీ వర్షాలతో జరిగిన నష్టం, ఇప్పటివరకు తీసుకున్న సహాయక చర్యలపై ఆయా శాఖల వారీగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకష్ణారావు, రాష్ట్ర ప్రకతి విపత్తుల నిర్వహణా విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాతో కలిసి సమీక్ష చేశారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యల వల్ల చాలా వరకు ప్రాణ, ఆస్తి నష్టం తగ్గిందని అన్నారు. సహాయక పనులను మరింత వేగవంతం చేయాలని చెప్పారు. ఇప్పటివరకు పరిహారాలను విడుదల చేయకపోతే వాటిని వెంటనే అందజేయాలని అధికారులకు సూచించారు. ఏ ఒక్క బాధితుడు పరిహారం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చెరువులు, కుంటలు, రోడ్ల మరమ్మతులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.



వర్షాలతో తీవ్రంగా దెబ్బతిన్న జిల్లాలకు రూ.10 కోట్లు, సాధారణ నష్టం జరిగిన జిల్లాలకు రూ.5 కోట్లను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. సహాయక చర్యలను ఆయా జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకొని హైదరాబాద్ నుంచి ఆయా విభాగాధిపతులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. వరద సహాయానికి సంబంధించి వినియోగించిన నిధులకు యూసీలను కేంద్రానికి అందించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈనెల 13వ తేదీలోగా ఆయా విభాగాలు యూసీలను సమర్పించాలని ఆదేశించారు. అల్పపీడనం కారణంగా వచ్చే రెండు రోజులపాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్, పంచాయితీరాజ్, హెల్త్, మున్సిపల్, ఆర్అండ్‌బీ, విద్యుత్ తదతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై మంత్రి పొంగులేటి సమీక్ష

నిజమైన జర్నలిస్టులకు మేలు జరిగేలా నిర్ణయాలు ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమీషనర్ సిహెచ్. ప్రియాంక, సీపీఆర్‌వో జి. మల్సూర్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా అక్రిడిటేషన్ విధానం, జర్నలిస్ట్‌ల హెల్త్ పాలసీ, జర్నలిస్టుల అవార్డులు, జర్నలిస్టులపై దాడులకు సంబంధించి హైపవర్ కమిటీ తదతర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ అంశాలపై కార్మిక, ఆరోగ్య, హోం, ఆర్థికశాఖ అధికారులతో త్వరలో మరోసారి సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు.

దేవుని పేరు చెప్పి రాజకీయాలు చేయొద్దు

- పూజారుల అంగీకారంతోనే గద్దెల ప్రాంతంలో పనులు
- మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేడారం గద్దెలపై రాజకీయం చేయడం మానుకోవాలని మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క అన్నారు. గిరిజన గోత్రాలు, పూజ ఆచారాల ప్రకారం.. అమ్మవార్ల పూజారుల అంగీకారంతోనే గద్దెల ప్రాంతంలో నూతన టెక్నాలజీతో పనులను ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. పూర్తిస్థాయిలో డిపిఆర్ పూర్తికాగానే ముఖ్యమంత్రి ముందు సమావేశమై పూర్తి నిర్ణయాలు తీసుకుంటామని అన్నారు.


లబ్దిదారులకు పట్టాలు అందజేస్తున్న సీతక్క

దీనికి సంబంధించిన నివేదికలను సంబంధిత అధికారులు తయారు చేస్తున్నారని తెలిపారు. గిరిజన పూజారులు, భక్తుల విశ్వాసం దెబ్బతినకుండా ఆలోచన చేస్తున్నామని, వెయ్యేళ్లు నిలిచిపోయేలా నిర్మాణపనులను చేపడుతున్నామని అన్నారు. జాతర సందర్భంగా రైతులక అన్యాయం జరగకుండా చూస్తున్నామని తెలిపారు. కొద్దిరోజుల్లో పూజారులు, దేవాదాయ శాఖ అధికారులతో ఆర్కియాలజీ అధికారులు సమావేశమై చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. ములుగు జిల్లా ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా పర్యాటక ప్రాంతంగా తెరకెక్కిందని, యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప, దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతర సమ్మక్క సారలమ్మ, దట్టమైన అడవీ ప్రాంతంతో పర్యాటకులను

సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ములుగు మండలం ఇంచర్ల గ్రామంలో నిర్మించనున్న ఆయిల్ పామ్ పరిశ్రమ నిర్మాణం కోసం భూములిచ్చిన 41 మంది రైతులకు ఇంచర్లలోని ఏకో పార్క్ వద్ద ప్రభుత్వ భూమి కేటాయిస్తూ రైతులకు మహబూబాబాద్ ఎంపి పోరిక బలరాం నాయక్, జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకరతో కలిసి పట్టాలు అందచేశారు. ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం మండలంలోని ఇంచర్ల గ్రామ శివారులో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందజేశారు. మేడారం అభివృద్ధిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడారు. మేడారం మహా జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా పలు గ్రామాల గుండా రోడ్డు విస్తరణ పనులు చేయడమే కాకుండా డైవర్షన్ రోడ్లను ఏర్పాటు చేయబోతున్నామని, ఎంతగానో ఆకట్టుకుంటుందని అన్నారు. ఎంపి బలరాంనాయక్ మాట్లాడుతూ.. ఎంతో చరిత్ర కలిగిన సమ్మక్క సారలమ్మ జాతర ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. మేడారంలో 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఫ్యాక్టరీ ఏర్పాటుతో పాటు ఇంటిగ్రేటెడ్ పాఠశాల, అటవీ శాఖ వారు ఏకో పార్కును ఏర్పాటు చేయడంతో ఇక్కడి ప్రాంతం రానున్న రోజుల్లో ఎంతో అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సిహెచ్ మహేందర్ జి, ఆర్డీఓ వెంకటేష్, ఇంచర్ల గ్రామంలో ఆయిల్ పామ్ పరిశ్రమ నిర్మాణం కోసం భూములు అప్పగించిన 41 మంది రైతులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విద్యాసంస్థలు జీవన వ్యవస్థలు

- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి
- ఐఐటి డైరెక్టర్ బిఎస్ మూర్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యా సంస్థలంటే.. జీవన వ్యవస్థలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలో ఉన్న మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయ నాలుగో స్నాతకోత్సవం ఇండోర్ స్టేడియంలో సోమవారం గవర్నర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా 22 మందికి పిహెచ్‌డి పట్టాలు, 57 మందికి గోల్డ్ మెడల్స్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ మాట్లాడుతూ.. విద్యారంగం, పరిశోధన, ఆవిష్కరణలు, సేవా కార్యకలాపాలతో మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం అద్భుతమైన పురోగతి సాధిస్తోందన్నారు. అడ్డంకులను అధిగమించి, బాధ్యతాయుతమైన, ఉత్పాదక, విజయవంతమైన పౌరులుగా తమను తాము మార్చుకుంటున్నారని తెలిపారు. విశ్వవిద్యాలయాన్ని జాతీయ స్థాయి విద్యా సంస్థగా తీర్చిదిద్దడంలో బలమైన పూర్వ విద్యార్థుల నెట్‌వర్క్‌లను పెంపొందించడం కొనసాగించాలని, వారి మద్దతును ఉపయోగించుకోవాలని సూచించారు. విద్యార్థులకు కొత్త సాంకేతికతలు అందించడం, ఉపాధి పెంపొందించడానికి.. పరిశ్రమల ఏర్పాటుకు.. కృత్రిమ మేధస్సును అందించేందుకు సిద్ధం చేయాలని చెప్పారు.ప్రతి విశ్వవిద్యాలయం పరిశోధనలను ప్రోత్సహించాలని, ఇంజినీరింగ్ విభాగంలో చేయూతనివ్వాలని హైదరాబాద్ ఐఐటి డైరెక్టర్ బిఎస్ మూర్తి చెప్పారు. ప్రతి విద్యార్థి చదివే సబ్జెక్టులో డిగ్రీతోపాటు తనకి ఇష్టమైన అంశంలో మరో డిగ్రీ సాధించాలని సూచించారు. నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ అల్వాల రవి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ఎడిసి భవాని ప్రసాద్, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి దేవసేన, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పి శరత్ చంద్రపవార్, అదనపు కలెక్టర్లు జె శ్రీనివాస్, నారాయణ అమిత్, నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

19న చలో గిరిజన సంక్షేమ కమిషనరేట్

- టిఎస్‌యుటిఎఫ్ పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గిరిజన సంక్షేమ శాఖలోని ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతుల షెడ్యూల్‌ను విడుదల చేయడంలో, ఆశ్రమ పాఠశాలలు, ఉపాధ్యాయుల ఇతర సమస్యల పరిష్కారంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగా ఈనెల 19న హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్‌లో చలో గిరిజన సంక్షేమ కమిషనరేట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్‌యుటిఎఫ్) పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆశ్రమ పాఠశాలలు, ఉపాధ్యాయుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ శాఖ కమీషనర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టడం జరుగుతుంది. మూడు నెలలుగా పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించాలనీ, గతేడాది నుంచి అనేక ఇతర సమస్యలను పరిష్కారం చేయాలంటూ కమిషనర్, కార్యదర్శి, మంత్రులకు ప్రాతినిధ్యం చేసినప్పటికీ స్పందన లేదని తెలిపారు. అనివార్యంగా పోరాటం చేయాల్సి వస్తోందని పేర్కొన్నారు.


ట్రైన్ హాల్టింగ్ ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి బండి తదితరులు

మంచిర్యాలలో వందే భారత్ ట్రైన్ హాల్టింగ్ ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో నాగ్‌పూర్ టూ సికింద్రాబాద్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ హాల్టింగ్‌ను సోమవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయ రైల్వే చరిత్రలో వందే భారత్ విప్లవాత్మక మార్పులు తెచ్చిందని, దేశవ్యాప్తంగా ప్రస్తుతం 150 వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయని తెలిపారు. వీటి ద్వారా ఇప్పటి వరకు 3కోట్ల మంది ప్రయాణికులు ప్రయోజనం పొందారని, ఒక్కో వందే భారత్ రైలు తయారీకి సుమారు రూ.130కోట్లు ఖర్చవుతాయని వివరించారు. ప్రస్తుతం తెలంగాణలో 5 వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయని, త్వరలో మరో రెండు రైళ్లురాబోతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో రైల్వే అభివృద్ధి కోసం కేంద్రం సుమారు రూ.80వేల కోట్లు వెచ్చించనుందని చెప్పారు. అమృత్ భారత్ పథకం కింద రైల్వేస్టేషన్లు మినీ ఎయిర్‌పోర్టుల్లా రూపుదిద్దుకుంటున్నాయని తెలిపారు. మంచిర్యాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి కోసం రూ.3.5కోట్లు కేటాయించామని, త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. అదనంగా స్టేషన్ అభివృద్ధికి అమృత్ భారత్ పథకం కింద రూ.26కోట్లు కేటాయించామన్నారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ, కలెక్టర్ కుమార్ దీపక్, పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి పాల్గొన్నారు.

సాదాబైనామా సీదా ఎలా..?!

- కోర్టు తీర్పు ఇచ్చినా కొనసాగుతున్న కన్ఫ్యూషన్
- మార్గదర్శకాల కోసం ఎదురుచూపులు
- రాష్ట్రంలో 9.80 లక్షల రైతుల దరఖాస్తులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెల్లకాగితాలపై చేసుకున్న భూ కొనుగోలు ఒప్పందాల (సాదాబైనామా) క్రమబద్ధీకరణ మార్గదర్శకాలపై జిల్లాస్థాయిలో అధికారులు ఎదురుచూస్తున్నారు. సాదాబైనామాపై న్యాయపరమైన చిక్కులు వీడినా తర్వాత ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. కానీ తదుపరి ప్రక్రియకు సంబంధించిన మార్గదర్శకాలను మాత్రం విడుదల చేయలేదు. 2020 నవంబర్ 10వ తేదీ నుంచి నిలిచిపోయిన ప్రక్రియను ముందుకు ఎలా తీసుకెళ్లాలనే విషయంపై స్పష్టత లోపించింది. రాష్ట్రవ్యాప్తంగా 9.80 లక్షల మంది రైతులు, ఒక్క ఖమ్మం జిల్లాలోనే 1.11లక్షల మంది సాదాబైనామా క్రమబద్ధీకరణ కోసం నిరీక్షిస్తున్నారు. ఈ వారంలోనే ప్రొసీడింగ్స్ వెలువడొచ్చని రెవెన్యూ అధికారులు అంటున్నారు.

2025 ఆర్ఓఆర్ చట్టం ప్రొసీడింగ్స్ ఎలా..!

2025 ఆర్ఓఆర్ చట్ట ప్రకారం సాదాబైనామాల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించినా.. ఏ విధానాన్ని అమలు చేయాలనే దానిపై స్పష్టత లేదని రెవెన్యూ అధికారులు అంటున్నారు. ఆర్ఓఆర్ 1971 చట్టంలో 11, 12 సెక్షన్ల ఆధారంగా దరఖాస్తుదారుకు, భూ యజమానికి నోటీసులు జారీ చేసేవారు. వాంగ్మూలం నమోదు చేసి క్షేత్రస్థాయి విచారణ అనంతరం నోటిఫికేషన్ ఇచ్చి, 13బి ప్రొసీడింగ్స్ ద్వారా పట్టాలు ఇచ్చేవారు. కానీ 2025 ఆర్వోఆర్ చట్టం మార్గదర్శకాల్లో స్పష్టత లోపించిందని రెవెన్యూ అధికారుల మాట. సాదాబైనామాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉచితంగానా? లేక ఫీజులు తీసుకోవాలా? అనేదానిపైనా స్పష్టత లేదు. ఒకవేళ ఫీజు తీసుకుంటే 1971 ఆర్వోఆర్ చట్ట ప్రకారమా? లేక 2025 ఆర్వోఆర్ చట్ట ప్రకారం తీసుకోవాలా? అనే విషయంలోనూ సందేహాలున్నాయి. అంతేకాదు, 2021 అక్టోబర్‌లో రాష్ట్రవ్యాప్తంగా 4.04 లక్షల సాదాబైనామా దరఖాస్తులను సిసిఎల్ఎ కలెక్టర్ల లాగిన్‌కు పంపింది. వీటిలో సుమారు 1.50 లక్షలకు పైగా దరఖాస్తులను కలెక్టర్లు తిరస్కరించారు. ఇప్పుడు వీటి పరిస్థితి ఏంటి? అనేదానిపైనా స్పష్టత లేదనేది సమాచారం.



2020లోని దరఖాస్తులకే పరిష్కారమా?

సాదాబైనామాల క్రమబద్ధీకరణపై జీవో 106ను ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. దీనిప్రకారం 2014కు పూర్వం సాదాబైనామాల ద్వారా క్రయవిక్రయాలు చేయటంతో పాటు 2020 అక్టోబర్ 12 నుంచి నవంబర్ 10 వరకు ప్రభుత్వానికి అందిన దరఖాస్తులను పరిష్కరిస్తారని రెవెన్యూవర్గాలు అంటున్నాయి. 12 ఏండ్లుగా భూమి తమ స్వాధీనంలో ఉన్నట్లు దరఖాస్తుదారులు ఆధారాలు సమర్పించాల్సి ఉంటుందని చెబుతున్నాయి. సెక్షన్ 6ను అనుసరించి కటాఫ్ తేదీ తర్వాత వచ్చిన దరఖాస్తులను పరిష్కరించేందుకు వీల్లేదని అంటున్నారు. కానీ, కటాఫ్ తేదీ తర్వాత అందిన దరఖాస్తులపై మాత్రం ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టతలేదు. భూ భారతి వచ్చిన తర్వాత నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఖమ్మం జిల్లాలో వివిధ రెవెన్యూపరమైన సమస్యలపై 75వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 45,254 సాదాబైనామాకు సంబంధించినవే ఉండటం గమనార్హం. ఇందులో 2020లో చేసుకున్న దరఖాస్తులను మాత్రమే పరిష్కరిస్తారనే చర్చ నడుస్తోంది. 2014కి ముందు తెల్లకాగితాలపై కొనుగోలు చేసిన ఐదెకరాల లోపు కుష్కీ, రెండున్నర ఎకరాల తరి ఉన్న చిన్న, సన్నకారు రైతుల భూములు రెగ్యులరైజ్ చేస్తామని అధికారులు చెబుతున్నారు. 2020తో పాటు జూన్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లోనూ చేసిన దరఖాస్తులనే పరిగణలోకి తీసుకుంటామంటున్నారు. 2020 కటాఫ్ తేదీ ప్రకారమే దరఖాస్తుల పరిశీలన ఉండొచ్చని భావిస్తున్నారు.

మార్గదర్శకాలు వచ్చాకే ముందుకు

పి.శ్రీనివాసరెడ్డి, అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ), ఖమ్మం జిల్లా

సాదాబైనామాకు సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు. గైడ్‌లైన్స్ వచ్చాకే తదనుగుణంగా ముందుకు వెళ్తాం. రెండు, మూడు రోజుల్లో మార్గదర్శకాలు వస్తాయని అనుకుంటున్నాం. ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌లోనూ రెవెన్యూపరమైన అంశాలపైనే ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయి. ముఖ్యంగా సాదాబైనామాలపైనే ఎక్కువ ఉంటున్నాయి.

పేదలకు పింఛన్లు ఇచ్చే వరకు పోరాటం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్
- మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సిపిఎం శ్రేణులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అర్హులైన పేదలందరికీ పింఛన్లు ఇచ్చే వరకు సిపిఎం పోరాటం చేస్తుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జె చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో పాలడుగు భాస్కర్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఒకటిన్నరేండ్లు పూర్తయినా వాగ్దానాలను అమలు పరచడంలో విఫలమైందన్నారు. కొత్త ఆసరా పింఛన్లు ఇప్పటి వరకు ఇవ్వలేదని తెలిపారు. తక్షణమే అర్హులైన వారందరికీ పింఛన్లు ఇవ్వాలని, పింఛన్ డబ్బులను పెంచాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీల కోసం రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తులు తీసుకున్నారని, వాటిని అమలు చేయకుండా ప్రజా పాలన పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, రూ.500కు గ్యాస్ సిలిండర్, రేషన్ కార్డులు, గృహజ్యోతి, మహాలక్ష్మి తదితర పథకాల కోసం 9.2 లక్షల మంది ప్రజలు దరఖాస్తు చేసుకున్నారన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి పి సత్యం మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆసరా పింఛన్ల అమలులో తీవ్ర లోపం జరుగుతోందన్నారు. పారిశ్రామిక కార్మికులు, పేదలందరికీ ఆసరా పెన్షన్‌లు ఇవ్వాలని కోరారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో వికలాంగుల పింఛన్ రూ.6,000, ఇతర పింఛన్లు రూ.4,000కు పెంచుతామని కాంగ్రెస్ చేసిన వాగ్దానం ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. ఏపీలో వికలాంగులకు రూ.6000, ఇతరులకు రూ.4000 పింఛన్ ఇస్తున్నారు గుర్తు చేశారు. వాగ్దానాలు అమలు చేయాలని, లేనిపక్షంలో రాబోయే రోజుల్లో ప్రజలను సమీకరించి సచివాలయం ముందు ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ విజేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జె చంద్రశేఖర్, కోమటి రవి, ఎ అశోక్, ఎం వినోద, మీసాల శ్రీనివాస్, ఐ రాజశేఖర్, నాయకులు ఎన్ శ్రీనివాస్, రాథోడ్ సంతోష్, లింగస్వామి, నరేష్, లక్ష్మణ్, సబిత, ఎం శంకర్, నాయకులు గణేష్, మంగ, స్వామి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోండి

- అసెంబ్లీ సహాయ కార్యదర్శికి బిఆర్ఎస్ నేతల వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలు వ్యక్తిగత ప్రయోజనాలే కాదు...అభివృద్ధి కోసం కాదని బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు వివేకానందగౌడ్, మాజీ ఎమ్మెల్సీ ప్రభాకర్ విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ సహాయ కార్యదర్శి ఉపేందర్‌రెడ్డికి వారు వినతిపత్రం అందజేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు చెప్పిన విషయాలను తమ లేఖలో పేర్కొన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు అమాయకత్వాన్ని నిరూపించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ సభలు, సమావేశాల్లో పది మంది ఎమ్మెల్యేలు పాల్గొంటూనే...తాము కాంగ్రెస్‌లో చేరలేదని బుకాయిస్తున్నారని విమర్శించారు. బిఆర్ఎస్‌కు రాజీనామా చేయకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేద్దామంటూ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రకటనను ఈసందర్భంగా గుర్తు చేశారు. ఆయనకు కెసిఆర్‌పై నమ్మకముంటే ఇంట్లో కేసీఆర్ ఫొటో, మెడలో బీఆర్ఎస్ కండువా వేసుకోవాలని సూచించారు. అభివృద్ధి కోసం సిఎం రేవంత్‌రెడ్డిని కలిసినట్టు చెబుతున్నారు సరే...కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఎందుకు కలిశారని ప్రశ్నించారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం పార్టీ మారి ఇప్పుడు నాటకాలాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ మారి తప్పు చేశామంటూ ఆ పది మంది బహిరంగంగా ఒప్పుకోవాలనీ, లేదంటే పార్టీ మారలేదని కేసీఆర్ దగ్గర పిటిషన్ పెట్టుకోవాలని సూచించారు. వీళ్లంతా దొరికిపోయిన దొంగలనీ, సిఎం రేవంత్ రెడ్డి మాటలు నమ్మి మోసపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇబ్బందికరంగా స్థానికత జిఒ

- సమస్య పరిష్కారానికి సహకరించండి
- కెటిఆర్‌కు మెడికల్ విద్యార్థులు, తల్లిదండ్రుల వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మెడికల్ అడ్మిషన్లలో స్థానికతకు సంబంధించి కొత్తగా తీసుకొచ్చిన జీవో ఇబ్బందికరంగా ఉందని పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తాము ప్రవేశాలకు అనర్హులుగా మిగిలిపోతున్నామని తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌కు పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు వచ్చి సమస్యను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ దృష్టికి తీసుకెళ్లారు. వారితో ఆయన సమావేశమయ్యారు. "కాంగ్రెస్ ప్రభుత్వం స్థానికతకు సంబంధించి ఒక ఇబ్బందికరమైన జిఒను తెచ్చింది. గతంలో పదవ తరగతి వరకు 7 సంవత్సరాలు ఎక్కడ చదివితే అక్కడే స్థానికులుగా పరిగణించే నిబంధన ఉండేది. అయితే ఇప్పుడు 9, 10, 11, 12 తరగతులు వరుసగా చదివిన వారికే స్థానికత వర్తిస్తుంది. వారికే మెడికల్ సీట్ల అడ్మిషన్లు దక్కుతాయని కొత్తగా ఇచ్చిన ఆదేశాల వల్ల వందల మంది విద్యార్థులు నష్టపోతున్నారు. పదో తరగతి వరకు తెలంగాణలో చదివిన తర్వాత, అత్యుత్తమ శిక్షణ కోసం ఆంధ్రాతో పాటు అనేక నాన్-తెలుగు రాష్ట్రాలలో కోచింగ్‌లు తీసుకుని నీట్ పరీక్షలకు సన్నద్ధమయిన వారున్నారు. ఇప్పుడు ఆ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అర్హత సాధించినప్పటికీ, ప్రభుత్వం వారిని అనర్హులుగా ప్రకటించి ప్రవేశాలు ఇవ్వడం లేదు...." అని వారు తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం మొండిగా సుప్రీంకోర్టు వరకు వెళ్లిందని వారు చెప్పారు.

విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సమస్యలను విన్న కేటీఆర్, వెంటనే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సమస్యను సానుకూలంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

చిన్నారిపై లైంగిక దాడి దోషికి 21 ఏళ్ల జైలు శిక్ష

- రూ.30 వేల జరిమానా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చిన్నారిపై లైంగికదాడి ఘటన పోక్సో కేసులో నల్లగొండ అదనపు జడ్జి-2 సోమవారం నిందితునికి 21 ఏళ్ల జైలు శిక్ష, రూ.30 వేల జరిమానా విధించినట్టు ఎస్‌పి శరత్ చంద్రపవార్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. చిట్యాల మండలం వనిపాకల గ్రామానికి చెందిన దోమల రాములు మూడో తరగతి చదువుతున్న బాలిక(8)పై 11.02.2018న లైంగికదాడి చేశాడు. బాధితురాలి తండ్రి చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. నిందితునిపై పోక్సో కేసు నమోదైంది. పోలీసులు పూర్తి విచారణ జరిపి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. అదనపు జడ్జి-2, ఎస్‌సి, ఎస్‌టి కోర్టు, పోక్సో కేసుల కోర్టు నిందితున్ని దోషిగా నిర్ధారించింది. 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.25,000 జరిమానా విధించారు. సెక్షన్ 448 ఐపిసి ప్రకారం ఏడాది జైలు, రూ.5000 జరిమానా మొత్తం 21 ఏళ్ల జైలు శిక్ష, రూ. 30 వేల జరిమానా విధించింది. బాధితురాలికి రూ. పది లక్షలు పరిహారంగా జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా అందించాలని తీర్పు వెలువడించింది. ఈ కేసులో సరైన ఆధారాలు సేకరించి చార్జిషీట్ దాఖలు చేసి నిందితునికి శిక్ష పడేలా చేసిన దర్యాప్తు ఆఫీసర్ సిఐ పాండురంగారెడ్డి, ఎస్ఐ సైదాబాబు, ప్రాసిక్యూషన్‌కు సహకరించిన నల్లగొండ డిఎస్‌పి కె శివరాంరెడ్డి, శాలిగౌరారం సిఐ నాగరాజు, నార్కట్‌పల్లి ఎస్ఐ రవికుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ వేముల రంజిత్‌కుమార్, సిడిసి యాదయ్య, లైజన్ అధికారులు, లీగల్ ఆఫీసర్ బరోసా సెంటర్ కె కల్పన, పి నరేందర్, ఎన్ మల్లికార్జున్‌ను ఎస్‌పి అభినందించారు.

అంగన్‌వాడీలపై దాడి దుర్మార్గం : ఐద్వా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంగన్‌వాడీలపై మగపోలీసుల దాడి దుర్మార్గమనిఅఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) విమర్శించింది. ఈ మేరకు సోమవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ అరుణజ్యోతి, మల్లు లక్ష్మి ఒక ప్రకటన విడుదల చేశారు. నూతన విద్యా విధానం అమలును నిరసిస్తూ అంగన్ వాడీ టీచర్లు, హెల్పర్లు సిఐటీయూ నాయకత్వంలో సిఎం క్యాంపు కార్యాలయం వద్ద శాంతి యుతంగా నిరసన వ్యక్తం చేస్తుండగా వారిపై మగపోలీసులు దాడి చేశారనీ, చాలా దురుసుగా ప్రవర్తించారని పేర్కొన్నారు. అంగన్‌వాడీలను లాగడం, తాకరానిచోట తాకటాన్ని వారు ఖండించారు. వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలతో సర్వేలతో పాటు అనేక ప్రభుత్వ పనులు చేయించుకుంటున్నారని పేర్కొన్నారు. పనికి తగిన వేతనం ఇవ్వడం కాకుండా గౌరవ వేతనం పేరుతో వారి శ్రమను దోచుకుంటున్నారని విమర్శించారు. వారికి ఉద్యోగ భద్రత లేకుండా చేసే నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని కోరారు. అడ్డగోలుగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


రాస్తారోకో చేస్తున్న బాధిత రైతులు

త్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలి

- రోడ్డుపై బాధిత రైతుల రాస్తారోకో

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

త్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను వెంటనే మార్చాలని పుట్టపాక, సర్వేలు, లింగారెడ్డిగూడెం గ్రామాల రైతులు సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని దేవిరెడ్డి గూడెం వద్ద రోడ్డుపై బైటాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు, రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న ఔటర్ రింగ్ రోడ్డుకు 40 కిలోమీటర్ల దూరంలో నిర్మించాల్సిన త్రిబుల్ ఆర్‌ను చౌటుప్పల్‌లోని దివిస్ కంపెనీ, కొంతమంది పెట్టుబడిదారుల ప్రయోజనం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం 28, 30 కిలోమీటర్లలోపు నిర్మించేందుకు తీసుకొచ్చిందన్నారు. ఆ అలైన్‌మెంట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కంపెనీల మీద ఉన్న ప్రేమ రైతులపై లేదని విమర్శించారు. జిల్లా మంత్రి, స్థానిక ఎమ్మెల్యే దివిస్ కంపెనీ యాజమాన్యం పెట్టే ఎంగిలి మెతుకుల కోసం త్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చారంటూ ఆరోపించారు. పుట్టపాక, సర్వేలు, లింగవారిగూడెం గ్రామాలకు చెందిన వందలాది ఎకరాల రైతుల పట్టా భూములు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు దివిస్‌ను పారదోల్తామని చెప్పిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి గెలిచాక రైతులనే పారద్రోలే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రాణం పోయినా తమ భూములను వదులుకోబోమన్నారు. నల్లగొండలో మంత్రి వెంకట్‌రెడ్డిని కలిసి తమ గోడు వినిపించుకునేందుకు వెళ్తే పోలీసులు అడ్డుకోవడం దారుణన్నారు. తమ ఆవేదన చెప్పేందుకు మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిని కలిస్తే.. ఉత్తరభాగం మారాలంటే ముందు దక్షిణ భాగం మారాలని.. ఈ రెండు మారాలంటే ప్రభుత్వమే మారాలేమో అని చెప్పుకొచ్చారని విమర్శించారు. రైతులకు న్యాయం జరిగే వరకు సిపిఎం అండగా ఉంటుందని ఆ పార్టీ సీనియర్ నాయకులు దోనూరు నర్సిరెడ్డి, దొంతగాని పెద్దులు అన్నారు. కలిసికట్టుగా ఐక్య ఉద్యమాలతో అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. రాసారోకోలో బద్దుల వెంకటయ్య, నాగార్జున, పలువురు రైతులు పాల్గొన్నారు.



నడిగడ్డతండా ప్రజల సమస్యలు పరిష్కరిస్తాం

- సిఆర్‌పిఎఫ్ అధికారులతో చర్చించాం
- వారం రోజుల్లో సమగ్ర నివేదిక
- జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్‌నాయక్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఆర్‌పిఎఫ్ భద్రతా బలగాలకు, నడిగడ్డ తండా ప్రజలకు మధ్య ఉన్న సమస్యపై గతంలోనే సిఆర్ఎఫ్ ఐజిఇఒతో చర్చించామని, తండా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలిగించొద్దని వారి దృష్టికి తీసుకెళ్లినట్టు జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్‌నాయక్ తెలిపారు. వారం రోజుల్లో సమగ్ర నివేదిక అందుతుందని, వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. సమస్యల పరిష్కారంతో పాటు రక్షణ కల్పిస్తామని స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా మియాపూర్ డివిజన్ పరిధిలోని నడిగడ్డ తాండాలో నెలకొన్న పలు సమస్యలపై స్థానికుడు స్వామినాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్‌నాయక్, పిఎసి చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, కలెక్టర్ నారాయణరెడ్డి, జాతీయ ఎస్‌టి కమిషన్ డైరెక్టర్ కల్యాణ్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్, చంద్రారెడ్డి, కస్టోడియన్ ఎనిమి ప్రాపర్టీ డిప్యూటీ సెక్రటరీ అశోక్‌కుమార్, సిఆర్‌పిఎఫ్ సెకండ్ కమాండెంట్ అమిత్ మిశ్రా.. నడిగడ్డ తాండాలో పర్యటించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాటోత్ హుస్సేన్‌నాయక్ మాట్లాడుతూ.. నడిగడ్డతండా, సుభాష్ చంద్రబోస్ నగర్, ఓంకార్ నగర్ కాలనీల్లో నెలకొన్న సమస్యలను త్వరలోనే పరిష్కారిస్తామన్నారు. తండా చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రక్షణ కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. భద్రతా బలగాల నుంచి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని, తండా అభివృద్ధి బాధ్యత తనదని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. రోడ్లు, డ్రయినేజీ, తాగునీటి సరఫరా, బస్తీ దవాఖాన, వీధి దీపాలు తదితర మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద అందరికీ ఇండ్లు నిర్మించుకునే విధంగా సహకారం అందిస్తామన్నారు. నడిగడ్డతండాలో ఆస్పత్రి, శ్మశాన వాటికను నిర్మిస్తామన్నారు. అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్లను, డ్రయినేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి రవీంద్ర నాయక్, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి రామేశ్వరిదేవి, వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ వెంకారెడ్డి, డిసి శశిరేఖ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ స్థానికులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో గంగపుత్రుల నిరసన


- పెట్రోల్ డబ్బాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమకు న్యాయం చేయాలంటూ జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లి మండలం కోనరావుపేట, కొండ్రికర్ల గ్రామానికి చెందిన గంగపుత్రులు పెట్రోల్ డబ్బాలతో ప్రజావాణి కార్యక్రమానికి వచ్చారు. కలెక్టరేట్ ఆవరణలో వారిని గమనించిన పోలీసులు అడ్డుకుని, పెట్రోల్ డబ్బాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం, వారిని కలెక్టరేట్ కార్యాలయం లోపలికి అనుమతించారు.

అంతకు ముందు గంగపుత్రులు మాట్లాడుతూ.. చెరువులు, కుంటలపై హక్కులను గంగపుత్రులకు మాత్రమే కల్పించాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్‌లకు చెరువులపై హక్కులు కల్పించడం దారుణమని, గత ప్రభుత్వ హయాం నుంచీ తమకు అన్యాయం జరుగుతోందని వాపోయారు. దాదాపు 30మందికి పైగా గంగపుత్రులు ఉండగా, తమను కాదని ముదిరాజ్‌లకు చెరువులపై సభ్యత్వం కల్పించడం అన్యాయమని అన్నారు. ఈ క్రమంలో పెట్రోల్ పోసుకోవడానికి ప్రయత్నించగా అక్కడే ఉన్న పోలీసులు పెట్రోల్ డబ్బాలను లాక్కున్నారు. తమకు న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని బైటాయించడంతో వారిని కలెక్టరేట్ కార్యాలయం లోపలికి అనుమతించారు.

అభ్యుదయ సాహిత్య యుగకర్త గురజాడ




ప్రజాశక్తి - కల్చరల్

భావ కవిత్వ యుగ కర్త రాయప్రోలు సుబ్బారావు కాగా అభ్యుదయ కవిత్వ యుగ కర్త గురజాడ అప్పారావుగా ప్రముఖ కవి డాక్టర్ సి నారాయణ రెడ్డి తన పరిశోధనా గ్రంథంలో పేర్కొన్న అంశాన్ని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కోలేటి దామోదర్ గుర్తు చేశారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికపై ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా గురజాడ అప్పారావు యాదిలో పేరిట సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కోలేటి దామోదర్ మాట్లాడుతూ గ్రాంథిక భాషలో మాత్రమే సాహిత్య రచనలు చేసే కాలంలో ఆధునిక భాషలో గురజాడ ముత్యాల సరాలు రాసి నాటి భాషా పండితుల మెప్పు పొందారని చెప్పారు. అయన రాసిన "దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుష్యులోయి" గీతంలోని పాదం నినాదంగా నేటికీ నిలిచి ఉందన్నారు. అయన నాటి సామాజిక ఆర్థిక రాజకీయ వ్యవస్థల్ని ప్రతిబించే విధంగా కన్యాశుల్కం నాటకం రాసి ప్రజలలో చైతన్యం కలిగించారని చెప్పారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన సభలో కవి రఘుశ్రీ, గాయనీ మణులు ఎస్ శ్రీదేవి, జి సీత పాల్గొన్నారు.

ఓఆర్ఆర్‌పై డివైడర్‌ను ఢీకొట్టిన ఇన్నోవా

- సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మృతి
- ఏడుగురికి తీవ్ర గాయాలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఔటర్ రింగ్ రోడ్డుపై కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో స్టాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందారు. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒఆర్ఆర్‌పై ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం వావిలాల గ్రామానికి చెందిన రాళ్లకత్వ సౌమ్యరెడ్డి (25) హైదరాబాద్‌లోని ఇన్ఫోసిస్ కంపెనీలో పనిచేస్తున్నారు. ఆదివారం తన స్నేహితులు నందకిషోర్, వీరేంద్ర, ప్రణీత్, సాగర్, అరవింద్, జాన్సీ, శృతితో కలిసి ఇన్నోవా కారులో యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండల పరిధిలోని, సరళ మైసమ్మ గుడికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో సాయంత్రం తన స్నేహితుల్లో ఒకరిని ఇబ్రహీంపట్నంలో దింపి.. బొంగ్లూర్ వద్ద ఒఆర్ఆర్ ఎక్కారు. ఘట్కేసర్ వైపు వస్తుండగా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బలిజగూడ పరిధి దాటాక ఎగ్జిట్ నెం.10 సమీపంలో వారి కారు అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టి పక్కకు దూసుకెళ్లింది. దాంతో కారులో ప్రయాణిస్తున్న వారికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే పోలీసులు హయత్‌నగర్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. సౌమ్యరెడ్డి, నందకిషోర్‌ను ఉప్పల్‌లోని సిటీ న్యూరో ఆస్పత్రికి తరలించారు. సౌమ్యరెడ్డి పరిస్థితి విషమించి సోమవారం మృతిచెందినట్టు వైద్యులు వెల్లడించారు. మిగతా వారు చికిత్స పొందుతున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



'మేధా' విద్యార్థుల భవితకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

- విద్యాశాఖ అధికారి హరిశ్చంద్ర
- పాఠశాల వద్ద తల్లిదండ్రుల ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మత్తు పదార్థాల తయారీ కేసులో సీజ్ అయిన మేధా పాఠశాల విద్యార్థుల భవితకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్టు బాలానగర్ మండల విద్యాధికారి హరిశ్చంద్ర తెలిపారు. పాఠశాలను సీజ్ ఆదివారం చేయగా.. సోమవారం ఉదయం పరీక్షలు ఉన్నాయని తల్లిదండ్రులు, విద్యార్థులు పాఠశాలకు రావడంతో అక్కడ ఆందోళన వాతావరణ నెలకొంది. తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళనకు దిగడంతో అధికారులు అక్కడికి చేరుకుని వారితో మాట్లాడారు. మేధా పాఠశాలను సీజ్ చేసినట్టు తమకు కనీస సమాచారం ఇవ్వలేదన్నారు. పరీక్షలు నిర్వహిస్తారని పిల్లలను పాఠశాలకు తీసుకొచ్చినట్టు చెప్పారు. పాఠశాలలో మత్తు పదార్థాలు తయారు చేయడం దారుణమన్నారు. తమ పిల్లల భవిష్యత్‌పై ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలకు టీసీ ఇస్తే ఇతర పాఠశాలల్లో చేర్పించుకుంటామని చెప్పారు.

ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, విద్యా సంవత్సరం పూర్తయ్యే వరకు విద్యార్థులను ఇతర పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు ప్రారంభించామని తెలిపారు. పాఠశాల యజమాని, కరస్పాండెంట్ ప్రకాష్ గౌడ్ రిమాండ్‌లో ఉండటం వల్ల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. సమీప పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పది సంవత్సరాలుగా పాఠశాలను నిర్వహిస్తున్నారని, ప్రస్తుతం 63 మంది విద్యార్థులు ఉన్నారని ఎంఈఓ తెలిపారు. ఇప్పటికే పాఠశాల అనుమతులను రద్దు చేసే ప్రక్రియ ప్రారంభమైందని చెప్పారు.

17న ప్రజా పాలనా దినోత్సవం

- ఏర్పాట్లు పరిశీలించిన ఉన్నతాధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17న (బుధవారం)హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్స్‌లో ప్రజా పాలనా దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం పలువురు ఉన్నతాధికారులు ముందస్తుగా పోలీస్ అధికారులు చేపట్టే రిహార్సల్స్, ఏర్పాట్లను పరిశీలించారు. డిజిపి డాక్టర్ జితేందర్, ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, విద్యుత్ శాఖ ఎం.డి.ముష్రఫ్ అలీ, సమాచార శాఖ కమిషనర్ సి.హెచ్.ప్రియాంక, జిల్లా కలెక్టర్ హరి చందన, ప్రోటోకాల్ జాయింట్ సెక్రటరీ శివలింగయ్య, అడిషనల్ సీపీ విక్రమ్ సింగ్ మాన్ తదితరులున్నారు.

నాలాలో గల్లంతైన ముగ్గురి కోసం గాలింపు

- అఫ్జల్‌సాగర్, వినోభా కాలనీలో పర్యటించిన హైడ్రా కమిషనర్



నాలను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో నాలాల్లో గల్లంతైన ముగ్గురి ఆచూకీ కోసం హైడ్రా ముమ్మరంగా గాలిస్తోంది. క్యాచ్‌పిట్లన్ని చోట్ల వెతుకుతోంది. ఆసిఫ్‌నగర్‌లోని అఫ్జల్‌సాగర్ నాలాతోపాటు ముషీరాబాద్‌లోని వినోభానగర్ నాలా పరిసరాల్లో గాలింపు చర్యలను హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్ క్షేత్ర స్థాయిలో సోమవారం పరిశీలించారు. ప్రతి క్యాచ్‌పిట్‌ను తెరిచి చూసిన తర్వాత వెంటనే వాటిని మూసేయాలని హైడ్రా సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ కురిసిన భారీ వర్షానికి ఆసిఫ్‌నగర్‌లోని అఫ్జల్‌సాగర్ నాలాలో మామ అల్లుడు అర్జున్, రాముతోపాటు ముషీరాబాద్‌లోని వినోభానగర్ నాలాలో దినేష్ అలియాస్ సన్నీ గల్లంతైన విషయం విదితమే. సోమవారం కూడా హైడ్రా గాలింపును ముమ్మరం చేసింది. జిహెచ్ఎంసి, వాటర్ బోర్డు, ఫైర్ పోలీసు తదితర శాఖలతో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. అఫ్జల్‌సాగర్ ప్రాంతంలో గాలింపు చర్యలను కమిషనర్‌తోపాటు హైదరాబాద్ కలెక్టర్ హరిచందన పరిశీలించారు.

నాలా ఆక్రమణలే ప్రమాదాలకు కారణం : హైడ్రా కమిషనర్

నాలాల ఆక్రమణలే ప్రమాదాలకు కారణమని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మీడియాతో అన్నారు. నాలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడమే కాకుండా, నీటి ప్రవాహాన్ని అశాస్త్రీయంగా దారి మళ్లించడంతో వరద సాఫీగా సాగడం లేదన్నారు. నాలాల సమస్య మూలాలకు వెళ్లి పరిష్కరించాల్సినవసరం ఉందన్నారు. వరద ప్రవాహానికి ప్రధాన అడ్డంకిగా ఉన్న ఒకటి రెండు కట్టడాలనే తొలగిస్తామని, మిగతా వారు ఆందోళన చెందాల్సిన పని లేదని చెప్పారు. నాలాల చెంతన పేదలే ఎక్కువ సంఖ్యలో నివసిస్తున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకుని, తప్పనిసరిగా కూల్చి వేయాల్సి వస్తే వారికి ప్రత్యామ్నాయం ప్రభుత్వం చూస్తుందన్నారు. జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, రెవెన్యూ శాఖలతో కలిసి అధ్యయనం చేసిన తర్వాతే ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. భారీ వర్షం పడితే అమీర్‌పేట పరిసరాలు నీట మునిగేవని, అండర్‌గ్రౌండ్‌లో పూడుకుపోయిన నాలాలను తెరవడంతో ముప్పు తప్పిందని అన్నారు. 25 లారీల వ్యర్థాల పూడికను ఒకే చోట తీసినట్టు కమిషనర్ తెలిపారు. ఈ వర్షాకాలంలో ఇప్పటి వరకూ 2200 లారీల వ్యర్థాల పూడికను తొలగించామని, ఇది నిరంతరంగా సాగుతుందని, నగర వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని ముమ్మరం చేస్తామన్నారు. ఇదిలా ఉండగా ప్రతి ఏటా వర్షాకాలంలో ఇదే సమస్య ఎదురవుతోందని నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ అన్నారు.

కొడుకు పట్టించుకోవడం లేదని వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

- ప్రజావాణిలో ఘటన.. ఆస్పత్రికి తరలింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కడదాకా కనిపెట్టుకుని ఉండాల్సిన కొడుకు, కోడలు ఆ వృద్ధ తల్లిదండ్రులను ఇంట్లో నుంచి గెంటేశారు.. మళ్లీ ఇంటికి వస్తే చంపుతామని బెదిరించారు. దిక్కుతోచని ఆ దంపతులు జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణికి వచ్చారు. కన్నీళ్లకు కరిగిపోని వ్యవస్థలో, కన్న పేగుకు విలువ ఇవ్వని తన కొడుకుకు బుద్ధి చెప్పండంటూ.. తండ్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. ఈ హృదయ విదారక ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలో సోమవారం జరిగింది. రుద్రంగి మండలానికి చెందిన అజ్మీర విఠల్, అతని భార్య వీరవ్వ తమ కొడుకు నరేష్‌పై ఫిర్యాదు చేయడానికి జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణికి వచ్చారు. కొడుకు, కోడలు తమను పట్టించుకోవడం లేదని, ఇంట్లోంచి వెళ్లగొట్టి చంపుతామని బెదిరిస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేశారు. గతంలో పెద్దమనుషులు, పోలీసులు కూడా ఈ విషయంలో జోక్యం చేసుకున్నా, తమకు న్యాయం జరగలేదని వారు వాపోయారు. ఈ క్రమంలోనే, తన బాధను వ్యక్తం చేయలేక, న్యాయం జరగదన్న నిస్సహాయతతో విఠల్ కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. కలెక్టరేట్ సిబ్బంది వెంటనే స్పందించి, విఠల్‌ను సిరిసిల్ల ప్రధాన ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన తీవ్రతను గమనించిన కలెక్టర్ తన వాహనంలోనే ఆస్పత్రికి పంపించారు. ప్రస్తుతం విఠల్‌కు చికిత్స కొనసాగుతోంది. అతని పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటన అనంతరం విఠల్ భార్య వీరవ్వ మాట్లాడుతూ.. 'మా కొడుకు నరేష్ మమ్మల్ని పోషించడం లేదు. కనీసం మాట్లాడటానికి కూడా ఇష్టపడడం లేదు. మమ్మల్ని ఇంట్లోంచి వెళ్లగొట్టి, చంపుతామని బెదిరిస్తున్నాడు' అని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పెద్దమనుషుల, పోలీసుల సమక్షంలో పంచాయితీ పెట్టినా, సమస్య పరిష్కారం కాలేదని ఆమె వాపోయారు.